# ఆటోవాలాల రాస్తారోకో, నిరసన



మోస్రాలో రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు



జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్ల ర్యాలీ

మోస్రా (చందూర్)/ కోటగిరి / నిజామాబాద్ స్పోర్ట్స్/ శక్కర్‌నగర్/నవీపేట, డిసెంబర్ 18 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో తమకు ఉపాధి కరువై బతుకుదెరువు కష్టమైందని ఆటోవాలాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో ఆటోడ్రైవర్లు సోమవారం రాస్తారోకోలు, నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు.

మోస్రాలో వెంకటేశ్వర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. తహసీల్దార్ సాయిలుకు వినతి పత్రం అందజేశారు. పోతంగల్ మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ఆటోయూనియన్ నాయకులు, ఆటోడ్రైవర్లు, యజమానులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

జిల్లాకేంద్రంలో నగరానికి చెందిన ఆటోడ్రైవర్‌లు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో మోటర్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బచ్చల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అమలులోకి తెచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అబ్దుల్ గఫార్, సాయిలు, షేక్ అబ్దుల్ జబ్బార్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



నవీపేట మండలం జన్నేపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బోధన్ పట్టణంలో ఆటో యూనియన్ ప్రతినిధులు, ఆటో యజమానులు, డ్రైవర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీగా బోధన్ ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని కార్యాలయ పరిపాలనాధికారి విఠల్‌కు వినతి పత్రం అందజేశారు. ఆటో యూనియన్ నాయకులు మహ్మద్ అయూబ్, రయీస్ ఖాన్, మహ్మద్ ముఖీం, సయ్యద్ జాకీర్, గజపాక సాగర్, ఎండీ లాయఖ్ అహ్మద్, షేక్ మొయిన్, ఎండీ సర్వర్ ఖాన్, రషీద్ సుభానీ పాల్గొన్నారు.

నవీపేట మండలం జన్నేపల్లి చౌరస్తాలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆలూర్ అరుణ్, ప్రధాన కార్యదర్శి ఈదోల్ల సందీప్ కార్మికులు పాల్గొన్నారు.






జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు , బోధన్ ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ ప్రతినిధులు

## వరినాట్లు వేసిన విద్యార్థులు

ధర్పల్లి, డిసెంబర్ 18 : విద్యార్థులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్స్ పాఠశాల విద్యార్థులను వ్యవసాయ క్షేత్ర పరిశీలన (ఫీల్డ్ విజిట్)కు సోమవారం తీసుకెళ్లారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వరినాట్లు వేయడం, పంటల సాగుపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. విద్యార్థులు వరినాట్లు వేశారు. హెచ్‌ఎం సాధన, ఉపాధ్యాయిని పద్మ పాల్గొన్నారు.



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

## శివాజీ విగ్రహం ఆవిష్కరణ

మోర్తాడ్,డిసెంబర్18: దొన్కల్ గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సామాజిక సామరస్యతావేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ ఆవిష్కరించారు. విగ్రహదాత దంతాల ప్రభాకర్, అప్పాల ప్రసాద్‌ను సర్పంచ్ కత్తి ముత్తెన్న లావణ్య, మాజీ ఎంపీపీ కల్లెడ చిన్నయ్య సన్మానించారు.

## ఎంపీటీసీని అప్పగించాలి

మాక్లూర్, డిసెంబర్18: మాక్లూర్ ఎంపీటీసీ-2 మీరాబాయిని అప్పగించాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు లక్ష్మి శ్రీనివాస్‌తో పాటు, మీరాబాయి కుటుంబ సభ్యులు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తన భార్యను కిడ్నాప్ చేశారని, మాక్లూర్ పోలీసులకు ఈనెల 12న ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని మీరాబాయి భర్త నారాయణ అన్నారు. ఆమెను వెంటనే అప్పగించాలన్నారు.

## అగ్ని ప్రమాదంలో బాలుడు మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్18: మండలంలోని చేపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకొని మహమ్మద్ జియావుద్దీన్(4) మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు కథనం మేరకు.. ఇద్దరు పిల్లలు ఇంటి దగ్గర్లో ఉన్న ఒక గదిలో గడ్డివాము వద్ద ఆడుకుంటున్నారు. ఆడుకుంటూ వారు గడ్డివాముకు నిప్పు పెట్టారు. మంటలు చెలరేగి నాలుగేండ్ల బాలుడు మహమ్మద్ జియావుద్దీన్ ఊపిరాడక గదిలోనే మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పివేశారు.

# భార్యను హత్యచేసిన భర్తకు జీవితఖైదు

నిజామాబాద్ లీగల్, డిసెంబర్ 18 : భార్యను హత్య చేసిన భర్తకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కనకదుర్గ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు వెలువరించిన నలభై పేజీల తీర్పులోని వివరాలు. ఇలా ఉన్నాయి. వేల్పూర్ మండలంలోని మోతె గ్రామానికి చెందిన భార్యాభర్తలు ముద్దుల ముత్తెన్న, ముద్దుల సాయమ్మ వారి కూతురు భారతితో కలిసి కొన్నేళ్లుగా బాగానే ఉన్నారు. కొన్ని కారణాలతో వారు విడివిడిగా జీవిస్తున్నారు. గ్రామ పెద్దల రాజీ పరిష్కారంతో తన కూతురు పేరున 30 గజాల ఖాళీ స్థలం, అర ఎకరం రాసి ఇచ్చాడు. సాయమ్మ తన కూతురితో కలిసి మోతె గ్రామంలో వేరుగా జీవిస్తున్నది. ఆధార్‌కార్డులో ఇంటిపేరు ముద్దుల అని ఉందని, దానిని దావ అని మార్చుకోవాలని సాయమ్మతో ముత్తెన్న గొడవ పడేవాడు. ఇంటిపేరు తనది ఉంటే భవిష్యత్‌లో తన ఇంటిని కూడా ఇవ్వమంటారని, తన భార్యకు, తనకు ఎటువంటి సంబంధం లేదని గ్రామ పెద్దల సమక్షంలోనే విడాకులు తీసుకున్నానని, మళ్లీ ఆస్తి అడుగుతుందని కక్ష పెంచుకున్నాడు. 29 నవంబర్, 2015లో మోతె గ్రామంలోని జువ్వి భాగ్యలక్ష్మి ఇంటి ఎదుట భార్యతో గొడవపడి పారతో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అడ్డుపడిన బావమరిదిని కత్తితో కడుపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కోర్టు న్యాయవిచారణలో ముద్దాయి ముత్తెన్నపై హత్య, హత్యాయత్నం, వరకట్న వేధింపుల నేరాలు రుజువైనట్లు నిర్ధారించారు. హత్య నేరానికి జీవిత ఖైదు, హత్యాయత్నం నేరానికి నెల జైలు శిక్ష, వరకట్న వేధింపులకు మూడేళ్ల కఠిన జైలుశిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారు.

వేల్పూర్ పోలీసుల తరపున డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఎస్కార్టు పోలీసులు ముత్తెన్నను నిజామాబాద్ జైలుకు తరలించారు. తల్లి సాయమ్మ హత్యకు గురికావడం, తండ్రి ముద్దుల ముత్తెన్న జైలు పాలు కావడంతో భవిష్యత్ అవసరాల నిమిత్తం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భారతికి తగిన ఆర్థిక సాయం అందజేయాలని జడ్జి కనకదుర్గ తన తీర్పు అనంతరం సిఫార్సు చేశారు.

## యువకుడి ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరా

వేల్పూర్, డిసెంబర్ 18: ఐదు రోజుల క్రితం మండలంలోని లక్కోరా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ లో చికిత్స పొందుతున్న వేల్పూర్ గ్రామానికి చెందిన యువకుడు దీపక్ ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్ నిమ్మల సత్యనారాయణతో సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. లక్కోరా వద్ద వర్షాల ప్రభావంతో వానకాలంలో ధ్వంసమై జాతీయ రహదారి కల్వర్టును తొలగించి కొత్త నిర్మాణం చేపట్టాలని సంబంధించిన అధికారులకు సూచించారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఇందల్వాయి, డిసెంబర్ 18 : రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఇందల్వాయి ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్-14 ఖోఖో, అండర్-17 ఖోఖో, అండర్-17 వాలీబాల్, అండర్-19 వాలీబాల్, అథ్లెటిక్స్ అండర్-19 రెజ్లింగ్‌లో ప్రథమస్థానం, అండర్-17 షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, అండర్-17, 100 మీటర్ల పరుగులో రెండో స్థానం, అండర్-17, 400 మీటర్ల పరుగుపందెంలో రెండో స్థానం, అండర్ -17లో 4x100 పరుగు పందెంలో రెండో స్థానం అండర్-19, 800 మీటర్లలో మూడోస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వివరించారు. విద్యార్థులతోపాటు కోచ్ సుష్మ, పీఈటీ సంధ్య, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

## 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర బేస్‌బాల్ చాంపియన్‌గా ఉమ్మడి నిజామాబాద్ జట్టు



ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18 : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర బేస్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టుపై 10-0 పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సంగీతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ అబ్జర్వర్ మర్కంటి గంగామోహన్, మహబూబాబాద్ జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి జ్యోతి బహుమతులు అందజేశారు. జనవరి 2 నుంచి 7 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు జిల్లా నుంచి బాలికల విభాగంలో.. నక్షత్ర, శరణ్య, గంగోత్రి, జాస్మిన్, సాహితి, వైష్ణవి, బాలుర విభాగంలో.. విష్ణు, విష్ణువర్ధన్ ఎంపికైనట్లు తెలిపారు.

## హాకీ క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18 : స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ పోటీల్లో కామారెడ్డి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులానికి చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ టీంపై 2-0 గోల్స్‌తో విజయం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఆర్సీవోతోపాటు సెక్రటరీ మల్లయ్య, ప్రధానోపాధ్యాయిని ప్రమదాదేవి, పీఈటీ మానసారెడ్డి సోమవారం అభినందించారు.